క్లుప్తంగా

బెంచీలు బహూకరణ



విద్యార్థులతో సీఐ రవి

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం అదే గ్రామానికి చెందిన హైదరాబాద్ సీఐ మెగిలిచర్ల రవి రూ.లక్ష విలువ గల బెంచీలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రతిఒక్కరూ చేయూతనివ్వాలన్నారు. అనంతరం రవిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తేజోరాం, హెచ్‌ఎంలు జనార్దన్, సురగాని లింగయ్య, ఉపాధ్యాయులు దొంగరి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మండలంలోని లాల్‌లక్ష్మీపురంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేష్, లయన్స్ క్లబ్ సభ్యులు రవీందర్‌రెడ్డి, సైదులు తదితరులు ఉన్నారు.

సూపరింటెండెంట్‌కు సన్మానం



దశరథనాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కోదాడ : ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన సూపరింటెండెంట్ జె.దశరథనాయక్ కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు పంది తిరపతయ్య కోరారు. రెండు రోజుల క్రితం కోదాడ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన దశరథనాయక్‌ను గురువారం వైద్యశాలలో సన్మానించారు. కార్యక్రమంలో చలిగంటి రామారావు, బాబునాయక్, వెంకటయ్య, మస్తాన్, లచ్చిరామ్‌నాయక్, సోమపంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గరిడేపల్లి : ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మునగాల మండలం ఆకుపాములకు చెందిన వల్లపురెడ్డి ప్రకాష్ కారులో మిర్యాలగూడ వెళ్తుతండగా కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ.1,06,900 లను నగదుకు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పోసిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నాగలక్ష్మీచంద్రశేఖర్

హుజూర్‌నగర్ : పట్టణంలో కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్న సీతారాం నగర్ మహిళా కమిటీ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు సులువ నాగలక్ష్మీచంద్రశేఖర్ గురువారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి, నాయకులు రామ్మూర్తి, లాలుగౌడ్, ముస్తఫా, వెంకన్న, వినయ్, వెంకట్, రాము, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది కాళ్లతో గొర్రె పిల్ల జననం



ఎనిమిది కాళ్లతో జన్మించిన గొర్రె పిల్ల

మునగాల : మండల కేంద్రానికి చెందిన యాదవ కులస్తుడు ముంత మలయ్యకు చెందిన గొర్రెల మందలో ఓ గొర్రె గురువారం ఎనిమిది కాళ్ల గొర్రె పిల్లకు జన్మనిచ్చింది. స్థానిక ఆసుపత్రిలో పశు వైద్యాధికారి గొర్రెకు చికిత్స చేయగా ఎనిమిది కాళ్ల గొర్రెపిల్ల పుట్టింది. కానీ పుట్టిన వెంటనే సదరు గొర్రెపిల్ల మృతిచెందినట్లు మల్లయ్య తెలిపారు. ఎనిమిది కాళ్లతో జన్మించిన గొర్రెపిల్లను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ఆస్పత్రికి తరలివచ్చారు.

కొత్త జీపీల్లో 'ఉపాధి' వెతలు

- నూతన గ్రామ పంచాయతీలకు ఫీల్డ్‌అసిస్టెంట్లను నియమించని ప్రభుత్వం
- మందకొడిగా ఉపాధి హామీ పనులు
- చేతినిండా పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

మేళ్లచెరువు : మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కరువయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం తండాలు, ఆవాస గ్రామాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి నాలుగున్నర సంవత్సరాలు దాటింది. కానీ ఇంతవరకు ఆయా పంచాయితీల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించలేదు. దీంతో కూలీలకు చేతినిండా పని కరువై ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 7 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్తగా మరో 7 ఏర్పడ్డాయి. మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా నూతన పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరి అవసరం ఉంది. కానీ అధికారులు పాత గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకే నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ పనులు చేయించే బాధ్యతలను అప్పగించారు. దీంతో ఒక గ్రామపంచాయతీకీ చెందిన ఫీల్డ్ అసిస్టేంట్ రెండు గ్రామ పంచాయతీల్లో పనులు పర్యవేక్షించడం కష్టంగా మారింది. ఉపాధి హామీ ప్రణాళిక రూపొందించేందుకు గ్రామ సభలను నిర్వహించి చేపట్టే పనులు, కూలీల బడ్జెట్ తదితర విషయాలను కూలీలను అడిగి తెలుసుకునే పరిస్థితి నెలకొంది.

సర్పంచ్‌లకు తిప్పలు

నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేయించేందుకు సర్పంచ్‌లకు తిప్పలు తప్పడంలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం పనులను పర్యవేక్షించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఏ చిన్న పనినైనా సర్పంచ్ చూసుకోవాల్సి వస్తుంది. ఉపాధి హామీ పనులు కల్పించేందుకు అందుబాటులో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆశించిన మేరకు పనులు కూడా చేయించలేకపోతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి



మంగళికుంటతండా, నల్లబండగూడెం గ్రామాలు గతంలో కందిబండ గ్రామ పంచాయతీలో ఉండేది. అవి పంచాయతీలు విడిపోయాయి. కానీ ఆ మూడు పంచాయతీలకు ఒకే ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు. దీంతో ప్రతి పనికి ఉమ్మడి పంచాయతీకి వెళ్లి తెలుసుకోవాల్సి వస్తుంది. ఫీల్డ్ అసిస్టెంట్ లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి.

– భూక్యా కోటేష్‌నాయక్, మంగళికుంటతండా

కూలీలకు పనులు కల్పించాలి



మంగళికుంటతండా ఆవాస గ్రామం గతంలో కందిబండ గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. నూతన పంచాయతీగా ఏర్పడినప్పటికీ ఉమ్మడి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌కే గ్రామాన్ని కేటాయించడంతో తండాలో ఉపాధి హామీ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. వెంటనే కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలి.

– భూక్యా రవినాయక్, సర్పంచ్, మంగళికుంటతండా

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం

కొత్త గ్రామపంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకానికి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నూతన గ్రామపంచాయితీల్లో సీనియర్ మేట్‌ల సహాయంతో పాటు ఉమ్మడి గ్రామ పంచాయతీలకు ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌లతో కొత్త పంచాయతీల్లో సైతం పనులు చేయిస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాక నియామకాలు చేపడతాం.

– శైలజ, ఉపాధి హామీ పథకం ఏపీఓ

నడిగూడెంలో నేలకొరిగిన వరి పొలాలు



నడిగూడెంలో నేలకొరిగిన వరి పొలాన్ని చూపుతున్న రైతు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు చాకిరాల గ్రామంలో బుధవారం రాత్రి వీచిన భారీ గాలులకు, కురిసిన వర్షానికి పలువురు రైతులకు చెందిన వరి పొలాలు నేలకొరిగాయి. పొట్ట దశకు వచ్చినవి, గింజ పోసుకున్న పొలాలు నేలకొరగడంతో తమకు నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సంతాపం



రామారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ఆర్య వైశ్య సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కొత్తూరి రామారావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అదేవిధంగా రామారావు మృతి పట్ల డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, ఎంపీటీసీ మండల చిన్నా శైలజ, జానకీరాములు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి

గరిడేపల్లి : ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ, టైఫాయిడ్ వైద్య పరీక్షలు చేయకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ప్రజలు ఆసుపత్రికి వస్తే వైద్య పరీక్షలు చేసి రిపోర్టుల కోసం వారం రోజులకి రావాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, హుస్సేన్, వెంకయ్య, నాగమ్మ, సైదమ్మ, లక్ష్మి, రాములు, జగదీష్, .వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ఎక్సైజ్ పోలీసుల దాడులు.. ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ నిందితులు, సారాతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: మఠంపల్లి మండలం కొత్తతండాలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తతండాలో తమ ఇళ్లలో సారా తయారు చేస్తున్న భూక్యా పద్మ, భూక్యా విజయ వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. గతంలో వీరిపై పలు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఇదే తండా శివారులో 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు దివ్య, వెంకన్న, జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

20 లీటర్ల నాటుసారా పట్టివేత

పాలకవీడు: అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను గురువారం పాలకవీడు మండలంలోని గుండ్లపహాడ్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపహాడ్ సమీపంలో గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కల్మేట్‌తండాకు చెందిన భార్యాభర్తలు బైక్‌పై క్యాన్‌లో 20 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘించి.. మద్యం దుకాణాలు తెరిచి

కోదాడ : కోదాడ పట్టణంలో బెల్ట్ దుకాణాల యజమానులు ఎన్నికల కోడ్ తమకు వర్తించదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. 24/7 విధానంలో మద్యం సరఫరా చేస్తున్నారు. విచిత్రం ఏమిటంటే పట్టణ ఎక్సైజ్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న బెల్ట్ షాపుల ద్వారా నిర్విరామంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. అనుమతులు ఉన్న మద్యం దుకాణాల యజమానులే సమయపాలన పాటిస్తుంటే వీరు మాత్రం ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. అలాగే పట్టణంలోని అశోక్‌నగర్ వద్ద ప్రధాన రహదారి వెంట దాదాపు 10 బెల్ట్ షాపుల వారు పోటీ పడి మద్యం అమ్మకాలు చేస్తున్నారు. అయినా కోడ్ పేరుతో హడావుడి చేస్తున్న సివిల్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు మాత్రం మద్యం అమ్మకాలపై ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోనే దాదాపు 150 బెల్ట్ షాపులు ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామానికి 5– 10 వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఈ చొప్పున నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 120 గ్రామాల్లో దాదాపు 1000 వరకు బెల్ట్ షాపులున్నాయి. అధికారులు ఈ బెల్ట్ షాపులపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు అవాస్తవం'



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, సాగర్‌రెడ్డి

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురం నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన 30 కుటుంబాలు ఎంపీపీ చింత కవితారాధారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారనేది అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కొప్పుల శ్రీనివాసరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కొప్పుల సాగర్‌రెడ్డిలు అన్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న వారికే తిరిగి కండువాలు కప్పి మా పార్టీలో చేరారని స్థానిక నాయకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని, ఇలాంటి అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వీరనాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

మునగాల : మండల కేంద్రంలోని దిమునగాల పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం బీసీ విద్యార్థి, యువజన, నిరుద్యోగ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ హాజరవుతారని తెలిపారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

మునగాల : మండలంలోని తాడువాయికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముంజల వెంకటేశ్వర్లు గురువారం తన అనుచరులతో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

నేరేడుచర్ల : సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నేరేడుచర్ల ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫేస్‌బుక్, వాట్సప్, ట్విటర్‌లో అనుచిత పోస్టులు పెడితే గ్రూప్ అడ్మిన్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు వైద్య శిబిరం ఏర్పాటు

పాలకవీడు : మండలంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో మిర్యాలగూడకు చెందిన రివర్ హాస్పిటల్ బృందంచే చర్మ, ఎముకలు, గుండె సంబంధిత వ్యాధులు, స్త్రీలకు సంబంధిత వ్యాధులు, సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

గరిడేపల్లి : ఎన్నికల నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా సహకరించాలన్నారు. గ్రామాల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు సమాచారం తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా

మునగాల : బీఆర్‌ఎస్ పార్టీ మునగాల గ్రామ శాఖ అధ్యక్షుడు చింతకాయల నాగరాజు బీఆర్‌ఎస్‌కు గురువారం గుడ్‌బై చెప్పాడు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి నాడు ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేసినానని, ఆనాడు తనకు సర్పంచ్ పదవికి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చి ఆ తర్వాత అన్యాయంగా తప్పించారన్నారు. బీసీ ఆర్థిక సాయం పంపిణీలో జరిగిన అవకతవకల విషయం తనను తీవ్రంగా బాధపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై నియోజకవర్గ పెద్దలకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోలేదని వాపోయారు. దీంతో తాను బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు నాగరాజు తెలిపారు.

కేసీఆర్ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష

మోతె : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామ రక్ష అని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు అన్నారు. గురువారం మండలంలోని నామవరంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆరె లింగారెడ్డి, జానీపాష, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నగేష్, వెంకన్న, పాపాచారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : జీతాలు రాక కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్న హన్మకొండ జిల్లా దామెర మండలం వెంకటాపురం వీఆర్‌ఏ సతీష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండల వీఆర్‌ఏలు కోరారు. వీఆర్‌ఏల పట్ల ప్రభుత్వ వైఖరిపై గురువారం హుజూర్‌నగర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సతీష్ మృతికి సంతాపం తెలిపారు.

బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్ల పట్టణ పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ బూత్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి బలమైన నాయకత్వం ఉందని, ప్రతి వంద మంది ఓటర్లకు ఒక బూత్ కమిటీ సభ్యుడు మానిటరింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వారు మరోసారి బీఆర్‌ఎస్ ఓటు వేయాలని కోరాలని అన్నారు. 9 ఏళ్ల బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, 60 ఏళ్లల్లో కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై వివరించాలన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీకి 70 కోట్ల నిధులు మంజూరు చేయగా కొన్ని పనులు పూర్తికాగా మిగిలిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. నేరేడుచర్లలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో 50 వేల ఓట్ల మెజార్టీని సాధిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నాడని, కనీసం 50 వేల ఓట్లు కూడా రావని విమర్శించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 108 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, కౌన్సిలర్లు శహానాజ్, బాషా, సరిత, సాయిరాం, లలిత, నాగవేణి, సులోచన, నాయకులు ఉన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

హుజూర్‌నగర్ : పేదల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ బూత్ కమిటీ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేసి మన సత్తా చూపించాలని కోరారు. ఈనెల 31న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కలిసి పని చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు చేయాల్సిన విధానం తెలిపి, వారి బాధ్యతలు అప్పజెప్పి దిశానిర్దేశం చేశారు. అనంతరం బతుకమ్మ సంబరాల్లో పాల్గొని మహిళలతో కలిసి ఆడిపాడి వారిని ఉత్సాహపరిచారు. పట్టణ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు గుండ్లపల్లి బ్రహ్మారెడ్డి, గురవయ్య, ఇమ్రాన్, ఎట్టణ అధ్యక్ష కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్ నాయకులు జీవీఆర్, కేఎల్‌ఎన్‌రెడ్డి, హరి బాబు, పిచ్చయ్య, నాగేశ్వరరావు, పద్మారాంరెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలానికి చెందిన పలువురు మత్స్య సహకార సంఘం డైరెక్టర్లు గురువారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పి.సైదులు ముదిరాజ్, పి.వెంకన్న ముదిరాజ్, సీహెచ్.దశరథ, ఎం.సైదులు, సీనియర్ నాయకులు రామంజి ముదిరాజ్, వీర సైదులు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కె వెంకట్ రెడ్డి, పి వీరయ్య గౌడ్, రాజ్ మహమ్మద్, వెంకట్రాములు, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడులో చామకూరి అంజి ఇటీవల మృతి చెందారు. గురువారం మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే సైదిరెడ్డి పరామర్శించి, మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయాలి

గరిడేపల్లి : గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన బీఆర్‌ఎస్ నాయకులు ఓట్ల కోసం వస్తే నిలదీయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని మంగాపురంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కామళ్ల నవీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య, ఉదయగిరి, నరసింహారావు, పారేలి నాగయ్య, వెంకటేశ్వర్లు, గుండు వెంకన్న, మేకల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం



వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : రైతు రుణమాఫీకి నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం నేటికీ అనేక మంది రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడం రైతులను మోసం చేయడమేనని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వ్యవసాయ అధికారి ప్రితమ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, వేశాల ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు పోకల సాంబయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు.

– సాక్షి నెట్‌వర్క్



నేరేడుచర్ల : బతుకమ్మలతో అంజలి స్కూల్ విద్యార్థులు



నడిగూడెం : శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో..



మోతె : రావిపహాడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో..



చిలుకూరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



నడిగూడెం : సిరిపురం ప్రాథమిక పాఠశాలలో..



మఠంపల్లి : వీవీ హైస్కూల్‌లో..



గరిడేపల్లి : సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో..



హుజూర్‌నగర్ : ఎండీఆర్ స్కూల్‌లో..



మునగాల : సాయి గాయత్రి విద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు